కథా నిలయం
శ్రీకాకుళం



# నిరంతరమూ... అనంతమూ.,

**ఆ** పాత కోటగోడల శిథిలాలనుండి నడుస్తున్నపుడు...,

ఏదో ఉద్విగ్నత...ఏదో వ్యాకులత...ఏదో అవ్యక్తావేశం... ఎందుకో పొంగి పొంగి పొర్లే దుఃఖం.

అడుగుల కింది మట్టిలో...ఏదో ఒక అశరీరజీవి కదుల్తున్నట్టు...మట్టిపొరల లోలోతుల్లో సమాధియైపోయిన మానవ చరిత్ర మళ్ళీ చేతులు చాచి బాహువుల్లోకి పిలుస్తున్నట్టు..,

ఎవరో...తనకు తెలిసినవారే...ఎవరో తనకు చెందినవాళ్ళే..తనదే ఐన సంతతి నుండి ఏదో వినబడని పిలుపు...

రాళ్ళు...అవశేషాలు...శిల్పాలు...విరిగిపోయిన విగ్రహాలు...పొందికగా కూర్చి కట్టిన పెద్దపెద్ద రాతి కట్టడాలు.. వందల సంవత్సరాల తర్వాతకూడా నిన్ననే ఎవరో పాలిష్ చేసినట్టు ధగధగా మెరుస్తున్న గ్రానైట్ శిల్పాకృతులు...ఆ రాతి నగలు, నగిషీలు, శరీర

భంగిమ.. అసలా ఎత్తుపల్లాలను, వక్రరేఖా తలాలను అంత నున్నగా ఏకరీతిగా మెరుపు పెట్టగల సాంకేతిక పరిజ్ఞానం అప్పటి ఆ తరానికెక్కడిది...వాళ్ళు ఏ పనిముట్లను వాడారు, ఏ సిద్ధాంతాలను పాటించారు...ఏ నియమాలను అవలంభించి యింత పెద్ద పెద్ద శిలలను యింత ఖచ్చితంగా కూర్చి యింత భారీ నిర్మాణాలను..ఆలయాలను, కోటగోడలను, మంటపాలను నిర్మించారు..,

మనకంటే ఎంతో విజ్ఞానవంతులైన తరాలు కాలగతిలో నశించిపోయాయా. నైపుణ్యతా, పనితనమూ, మేధాపటిమ ఎంతో ఉన్నతంగా గల ఒక జాతి కాలగర్భంలో కలిసిపోయి ఆనవాళ్ళుగా ఈ శిథిలాలై మిగిలాయా..

సైంటిస్ట్ రాయలు చటుక్కున ఆగిపోయి కిందికి చూశాడు.

రాతిమెట్లు...కిందికి..యింకా కిందికి..,

కోనేరు.. నడుమ పచ్చగా నీరు.

చటుక్కున వర్షం ప్రారంభమైంది..చుట్టూ మనుషులెవరూ లేరు.

రాళ్ళపై వర్షపు చినుకుల శబ్దం...చిత్రంగా, హృద్యంగా... లయబద్ధంగా...

ఏదో వివశత...ఏదో విమోహలయ...సమ్మేళనమౌతూ. విచ్ఛిన్నమౌతూ... తెగుతూ మళ్ళీ అతుకుతూ అద్భుతమైన శబ్దఝరి.

ఎవరో గుండెలను తడుత్తున్నారు...శరీరమంతా ప్రస్పందిసత్తూ అంతరాంతరలోకాల్లో ఏదో అలజడి ఉధృతమౌతోంది.

రాతిమెట్లపైనుండి ఒక్కో అడుగే కిందికి గిదుతూ..

వందలమెట్లు.

మెట్లు...పైనుండి కిందికి కిందికి దిగిపోడానికి...కిందినుండి ఎక్కి ఎక్కి పైకి రావడానికి...దేనికీ మెట్లు?

చినుకులు పైన రాల్తూనే ఉన్నాయి.

రాయలు..దిగి దిగి...చుట్టూ కలియజూశాడు.

అతనికా క్షణం భరించరాని భయం కలిగింది..చుట్టూ వందల రాతిమెట్లు నాల్గువైపులా...పైన ఎంతో ఉన్నతంగా మంటపం...ఆ పైన రాతి ఆలయ శిఖరం...శిఖరంపైన దట్టంగా మబ్బుపట్టిన ఆకాశం గాయపడ్డట్టు ఎర్రగా రక్తపు మడుగు.

ఎక్కడినుండో గుడిగంటల చప్పుడు.

పైన ఎక్కడో తన కారు...ఉదయమే తను ఒంటరిగా రావడం.. అకస్మాత్తుగా మనసులో కోరిక కలిగి...కారును చటుక్కున ఈ 'ఫోర్ట్' ప్రాంతానికి తిప్పుకుని..ఏదో మాయ ఆవహించి ఆదేశిస్తున్నట్టు నడుపుకుంటూ...వచ్చీ వచ్చీ...

ఏమిటిది...ఏమైంది తనకు.

రాయలు ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు.

భారత కేంద్ర ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ రహస్య ఆదేశాలమేరకు మొన్న విజయవంతంగా ప్రయోగించబడ్డ అంతరిక్షనౌక రూపకల్పనలో సహాయపడ్డానికి మూడు నెలలక్రితం తనూ, లీల యిక్కడికి రావడం..గత మూడు నెలలుగా క్రయోజనిక్ బూస్టర్ ఇంజన్ల పనితీరును సవరించడంలో నిమగ్నమైపోవడం...రాత్రుళ్ళు...పగళ్ళు...తేడాయే తెలియదు...పని పని...పని.

తనొక స్పేస్‌సైంటిస్ట్...

ఉపనిషత్తుల్లో ఎప్పుడో ప్రస్తావించారు...'వ్యోమశాస్త్రం'

వరాహమిహిరుడు, ఆర్యభట్ట...ఖగోళ విశ్లేషణ.. గ్రహాంతర రహస్య ఛేదన...గణన. లెక్కించు లెక్కించు...దూరాలను, కాలాన్ని, రహస్యాలను, వెలుగు చీకట్లను, విశ్వాంతర వింతలను... లెక్కించు,

ఏ ఆధారమూలేని ఒక శూన్యంలో...గ్రహం పరిభ్రమించడం, భ్రమించడం. అభికేంద్ర అపకేంద్ర, గురుత్వ బలాల బహుళ సమ్మేళనాలతో.... పంచభూతాత్మకమైన ప్రాణిని సృజించడం...ప్రాణి జీవాన్నీ, స్పర్శను, జ్ఞానాన్ని, బుద్ధిని, చేతనను...ఆలోచనను పొంది.,

వ్యోమం...హోమం...రసం...రసాతలం...రసాంతర నైరూప్యత. ఏమిలేని చోట ఒక మొక్క..ఒక మొగ్గ...కొమ్మలోనుండి ఒకచోట ఒక ఆకు... ప్రక్కనే పువ్వు..పువ్వు కాయై, పండై...రాలి...ఒక విస్తరణ ...ఒక వ్యాప్తి.

...ఏమిటిదంటా.

పంచభూతాల సమ్మేళనమైన మనిషి శరీరం...పునరేకీకరణ దిశలో...మళ్ళీ మట్టిగా మారాలనీ, మళ్ళీ నీరుగా, నిప్పుగా విడిపోవాలనీ, సమ్మేళన, విచ్ఛిత్తి పునఃపునః జీవక్రియల శృంఖలలో శేషమై, నిశ్శేషమై, శృంఖలయై, దీర్ఘమై ఒకసారి జన్మించి, బీభత్సించి...జీవించి....శుష్కించి, లయించి, మరణించి మరణ సౌందర్య ప్రకాశచ్ఛటలను ప్రస్ఫుటించి..

మనిషి... ఐచ్ఛికంగానే మరణాన్ని కాంక్షిస్తూంటాడా...

ఎత్తైన కొండపైకి...ఎనభయ్యో అంతస్తుపైకి ...చేరినపుడు కిందికి దూకాలని ప్రతీమనిషిలో ఓ లిప్తకాలం విజృంభించే చిత్రమైన రహస్యవాంఛ నిజానికి మృత్యుకాంక్షేనా?

మట్టి ఇనుముగా మారి...ఇనుము తుప్పుపట్టి మళ్ళీ మట్టిగా మారాలని తపిస్తూ,

మట్టిలో మొక్క చెట్టయి...పండై...రాలి...కూలి...మట్టయి... మళ్ళీమొక్క అంతా వలయ భ్రమణం..

ఎక్కడినుండి బయల్దేరుతున్నావో... పయనించి పయనించి...మళ్ళీ అక్కడికే,

నిశ్చలంగా ఉన్న చక్రం తిరిగి తిరిగి... మళ్ళీ ఆగి... నిశ్చలమై..

జడత్వమా అది... సృష్టిఅంతా జడత్వమయమా... ఇప్పుడున్న స్థితినుండి పూర్వస్థితిలోకి అభిక్రమించాలని తపించడమే జడత్వమైతే... జడత్వ లక్షణాలు లేని వస్తువు, పదార్థం, జీవి ఉందా...

అంతా వలయం... వర్తులం...

శూన్యంలోనుండి శూన్యం తీసివేసినా, శూన్యానికి శూన్యాన్ని కలిపినా మిగిలేది మళ్ళీ శూన్యమే ఐనపుడు, శూన్యం అనంతమైనపుడు, శూన్యం యొక్క ఉనికి భౌతికమా.. భౌతికాతీతమా.

రాయలు రాతిమెట్లను ఎక్కి ఎక్కి పైకి వచ్చాడు.

క్రిందికి చూస్తే మళ్ళీ భయం వేసింది... ఎంత గంభీరమైన నిర్మాణమది... వందల ఏళ్ళక్రితంది... ఎంత నిష్టగా జరిపారీ నిర్మాణాన్ని.,

చుట్టూ కూలిన రాతిగోడలు... విరిగి విధ్వంసమై చెల్లాచెదురుగా శిథిలావశేషాలు

దూరంగా పచ్చగా గడ్డి... ఎక్కడా మనుషుల అలికిడిలేదు.. వర్షం వెలిసింది.. వాన వాసన.. ఏదో జీవస్పర్శ.

రాయలు సిగరెట్టు వెలిగించుకుని అడుగులో అడుగేసుకుంటూ కారు దిక్కు నడుస్తున్నాడు

టైం చూచుకున్నాడు... ఏడూ నలభై.

వెళ్ళాలిక. తన అపాయింట్‌మెంట్ ఎనమిది గంటలకు.

మనిషి అనే జీవి నిజానికి ఎంత చిత్రమైన వింత ప్రాణి.

ఎవరో కవి అన్నాడు

'కన్ను తెరిస్తే ప్రపంచంలో నువ్వు.

కన్ను మూస్తే నీలోనే పలు ప్రపంచాలు'

మనిషికి తన వర్తమాన స్థితి ఏదన్నాకానీ... అది నచ్చదు

మార్పుకావాలి... స్థితి మారాలి.. తనకున్నది వద్దు. లేనిది, తెలియనిది ఏదోకావాలి.

ఏమికావాలి... ప్చ్... తెలియదు. ఎందుకు కావాలి... ఉహుఁ.. తెలియదు..

తెలియని దానికోసం ఆరాటం.. వేట... అన్వేషణ... వెంపర్లాట... నిరంతరం.... అనంతం.,

నిజానికి... మనిషి కళ్ళుమూసుకుని తనలోకి తాను చూచుకున్నా, కళ్ళుతెరచి నిండు నీలాకాశంలోకి చూచినా ఎంత ప్రశాంతతో.. ఎంత బీభత్సమో, ఎంత విహ్వలతో... ఎంత భయమో.

లోనికి..లోలోనికి..ఆత్మలోకి తొంగి చూచుకుంటున్నపుడు,

ఒక చీకటి బావిలోకి చూస్తున్నట్టు...ఒక ప్రళయించే సముద్రంలోకి చూస్తున్నట్టు..

తను ఎవరో ఓ పురాతన మనిషియొక్క సుదీర్ఘ జీవిత శృంఖలలో ఓ కొలికివలె...ఒక కొనసాగింపా...ఒక వారసత్వమా...ఎవరో పూర్వీకుల అవశేష జీవపదార్థంగా ఒక ఉనికా.. అనువంశికంగా వస్తున్న ప్రవర్తన, ప్రతిస్పందనలు, ప్రతిఫలనలు, ప్రతిచర్యలు...యివన్నీ ...గుప్తంగా, అదృశ్యంగా, రహస్యంగా మనిషిని దహిస్తూ,

అందుకే...ఏ చారిత్రక శిథిలాలల్లో గడిపినా, ఏ పూరావైభవావరణలోకి తొంగిచూచినా, ఏ పూర్వమానవుని అపూర్వ కృతులను స్పర్శించినా, ఏ వృత్తిపరమైన నైపుణ్య కృతుల్లోకి ప్రవేశించినా..

అవన్నీ తనకు చెందినవేననీ, వాటన్నింటికీ తాను వారసుడననీ, ఆ గతమంతా తన భూతప్రపంచంలో తనకు తెలిసిందేననీ,...మళ్ళీ మళ్ళీ తను ఆ తన ఉజ్జ్వల గతంలోకి పయనించాలని, ఆ పురాతన సంపదను మళ్ళీ స్పర్శించి ఆనందించి అనుభవించాలనీ..

రక్తంలో ఏవో జన్యువులు...ఏవో జీవధాతువులు...ఏవో ప్రాణస్వరాలు...ఏవో బీజబిందువులు...

మళ్ళీ ఆ గతం కావాలి...ఆ గతవైభవం కావాలి...ఆ గత ఉజ్జ్వలత కావాలి..మళ్ళీ,

రాయలు కారు ఆ పెద్ద దుకాణం ముందు ఆగింది. మనుష్య సంచారం లేదు.

పెద్ద బోర్డు

'ఆంటిక్విటీ'

కారు దిగి...లోనికి నడిచి...రిసెప్షన్‌లో ఉన్న అమ్మాయికి తన అపాయింట్‌మెంట్ లెటర్, ఐడీకార్డు చూపించాడు.

సరిగ్గా అప్పుడే..అతనికి అతని భార్య...తన సహ సైంటిస్ట్ లీల జ్ఞాపకమొచ్చింది.

తామిద్దరూ యిక వచ్చేవారం ఈ చారిత్రక ప్రాంతాన్ని విడిచి మళ్ళీ ఢిల్లీ వెళ్ళిపోవాలి. లీలతో ఈరోజు తన వ్యక్తిగత అవసరం గురించి ఎంగేజవుతున్నట్టుగా చెప్పిన విషయం జ్ఞప్తికొచ్చింది..ఆమెకు తనీరోజు అందుబాటులో ఉండదు.

'సర్...ప్లీజ్' – స్టివార్డ్ వచ్చి రాయలును లోపలికి తోడ్కొనిపోయాడు.

## 2

రాయలు ఎదురుగా ఉన్న అద్దంలోకి చూచుకున్నాడు.

తను నిజంగానే కుమ్మరి కులానికి చెందిన నడీడు మనిషిలా కనిపిస్తున్నాడు. ఎంతో ఖచ్చితంగా, కట్టూ బట్టా, రూపురేఖా మార్చాడు ఆ వ్యక్తి...తనను తాను చూచుకుంటూండగానే తన అంతరాంతరాల్లో, రక్తంలో లీనమై ఉన్న కుమ్మరి కుల వృత్తి నిపుణుడు నిద్రలేచాడు.

'పల్లెలు కన్నీళ్ళుపెడ్తున్నాయి'

'కులవృత్తులు ధ్వంసమైపోతున్నాయి'

వృత్తి కళలూ, కళాకారులూ కాలగర్భంలో కలిసిపోతున్నారు.

అద్భుతమైన కులవిద్యలు, నైపుణ్యతలు, సృజన, హస్తకళల సౌందర్యం... అన్నీ విచ్ఛిన్నమైపోతున్నాయి.

ఔనా... ఆధునీకీకరణ, పారిశ్రామికీకరణ, సాంకేతికీకరణ జరుగుతున్నపుడు.. పాతనీరు పోయి కొత్తనీరు వచ్చినట్టు ఈ మార్పు అనివార్యమౌతుంది కదా. ట్రాక్టర్ వచ్చినపుడు ఎడ్లబండ్లు పోతాయి. 'విద్యుత్ బల్బు వచ్చినపుడు కిరోసిన్ దీపం నిష్క్రమిస్తుంది. త్రషర్ వచ్చినపుడు నూర్పుడు విధానం కనుమరుగౌతుంది. ఐతే..యిక్కడ....మిగిలి ఉండేవి..రక్తంలో యిమిడిపోయిన వృత్తిపట్ల ప్రాణసమానమైన అనుబంధం...నిమగ్నత ...పనిలో మమేకమైపోయిన జీవితంపట్ల మమకారం..యిది తరాలు మారుతున్నకొద్దీ పల్చబడ్తుంది..క్రమంగా కనుమరుగౌతుంది.

ప్రస్తుతం ఒక సందిగ్ధ రూపాంతరత...అందుకే కోల్పోయిన జీవితాన్ని మళ్ళీ జీవించాలని, గడచిన ప్రాణప్రదమైన అనుభవాల్ని మళ్ళీ పొందాలని తపన...అర్తి.,

రాయలు తనకు అలాట్ చేసిన చాంబర్ ఇరవై మూడుకు చేరుకున్నాడు.

పైకి దోసిన గోచీబిళ్ళ కట్టుతో ధోతి. నెత్తిపై రుమాలు. చేతిలో సారెకట్టె. కాళ్ళకు కిర్రు చెప్పులు. ఒంటినిండా కృత్రిమ చెమట. పైన ఒంటిమీద ఏ ఆచ్ఛాదనా లేదు.

ఎంతో సంతోషమేసింది రాయలుకు.

చిన్ననాడు తన తాత...తండ్రి...కుండలు చేయడం...తను మన్ను పిసికి, సారె తిప్పుతానని మారాం చేయడం, విశాలమైన వాకిలినిండా కుండలను ఎండబెట్టడం, తన అన్న, అమ్మ పచ్చి కుండలను రాతిముద్ద, సల్పతో చర్వడం, నెలకోసారి కుండలను కాల్చేందుకు వాము పెట్టడం...

అన్నీ నిప్పుకణికల్లాంటి జ్ఞాపకాలు.. కణకణ.

కుండలను తనూ చేస్తానని మారాం చేసి పాడుచేసేవాడు తను... పగులగొట్టేవాడు. తండ్రి చేతుల్లో వీపుగిలేది. నానమ్మ అక్కున చేర్చుకుని

ఓదార్చేది.. ముద్దాడేది.

అది ఒక మహానుభూతి...ఒక జీవింపజేసే జ్ఞాపకం.

రాయలు సారె బొడ్డుపై మట్టిని సర్ది, ఒడుపుగా కర్రను సారించి తిప్పడం మొదలెట్టాడు. గిరగిరా గిరగిరా సారె కదిలింది.

సముద్రం పొంగింది గుండెల్లో

ఈ జీవితాన్నే ఒక్కరోజైనా జీవించేందుకు ఈ'ఆంటిక్విటీ'లో ఎప్పుడో నెలక్రితం బుక్ చేసుకుని...యిప్పుడు రావడం.

మనిషిలో ప్రచ్ఛన్నంగా జ్వలించే పురాజీవిత కాంక్షను మనిషికి ఓ అలౌకిక అనుభవంగా అందించే 'అభిరుచి'ని వ్యాపారం చేస్తున్న ఈ 'ఆంటిక్విటీ' సృష్టికర్త ఎవరో అభినందనీయుడే.

గంట...రెండు గంటలు..మట్టి వస్తువులుగా మారుతోంది.

రెండు కుండలు, ఒక తొట్టి, నాల్గయిదు గూనలు..ఒక కంచుడు.,

ఇంకా ఇంకా...చేతులకు తృప్తినిస్తూ శరీరంనిండా ఒక విద్యుదానందం...చల్లబడుతున్న తృష్ణ...నెరవేరుతున్న కోరిక...సంతృప్తమౌతున్న ఆత్మ.

మనిషి తన మూలాలను తెలుసుకోవడం..తన నికార్సయిన అసలు జీవితాన్ని జీవిండచం...తన పుట్టుకనూ, ఎదుగుదలనూ, తనను తాను గుర్తెరుగడం...ఎటువంటి ముసుగులూ, నటనలూ, మోసాలూ లేని స్వచ్ఛమైన పారదర్శక జీవితాన్ని జీవించడం...

ఆనందం...చాలా ఆనందం..పరమానందం.

ఒక అతిసాధారణ కుమ్మరి కుటుంబంలో పుట్టి...పేదరికం, ఆకలి, కన్నీళ్ళు, కష్టాలు..పోరాటం...అందని చదువుకోసం తపస్సు...

రాయలు ఎదుట సారె గిరగిరా తిరుగుతోంది నిశ్శబ్దంగా...

సాయంత్రం ఐదయింది.

ఒళ్ళంతా చెమట...పరిసరమంతా చిత్తడి...ప్రక్కన తను తయారించిన కుండలు, వస్తువులు వగైరా.,

చివరికి ఒక నిధిలా మిగిలిన తృప్తి...

'ఒక్కసారి బయటకు వెళ్ళి...అటు ఇటూ కాస్సేపు తిరిగొస్తే... ఈ 'ఆంటిక్విటీ' రూపురేఖలను గమనిస్తే..,

రాయలు అదే ఆహార్యంతో బయటకు వచ్చి నడుస్తున్నాడు.

పచ్చగా పచ్చిక బయళ్ళు. అక్కడక్కడ కొందరు గొర్రెలను మేపుతున్నారు. దూరంగా చిన్న చెరువులోకి దిగి కొందరు బెస్తలు చేపలు పడ్తున్నారు. అటువేపు పొలాల్లో కొందరాడవాళ్ళు గోచీ కట్టుకున్న చీరల్లో వంగి వరి నాట్లు పెడ్తున్నారు. ఇటుదిక్కు తాటివనంలో ఎవరో చెట్టెక్కి కల్లు దింపుతూంటే క్రింద మండువలో

కొందరు కల్లు తాగుతున్నారు. ప్రక్కన వేప చెట్టుకింద ఎవరో పద్మశాలి వృద్ధుడు పొడగాటి నూలు దారాల 'సరి' చేస్తున్నాడు.

అంతా సజీవ వాతావరణం...పల్లె జీవితం...

రాయలు ముందుకు నడుస్తున్నాడు అంతా గమనిస్తూ...మౌనంగా.

ప్రక్కన ఓ...వరిగడ్డి కప్పిన గుడిసె అరుగుపై కూర్చుని ఓ యువతి గోడకు ఆనించిన చట్రంపై పడుగు పోస్తోంది. అటువేపు దారం నిండిన పంటె ఉంది. ఇటు రాట్నం ఉంది. క్రింద ఖాళీ ఊశెలు. పంటెపైనున్న దారాన్ని ఊశెతో చకచకా పడుగు పోస్తోంది ఆమె ఎంతో నిమగ్నతతో...

గమనించాడు రాయలు..చటుక్కున.

ఆమె లీల...తన భార్య ...తన సహచరి.

తనతో పాటు స్పేస్ సైంటిస్ట్‌గా పనిచేసే ఒక ఆధునిక స్త్రీమూర్తి.

ఆమెకు తెలియకుండా తను..తనకు తెలియకుండా ఆమె... యిక్కడ...ఒక పురానుభవం కోసం

'తాము జీవిస్తున్న జీవితం పూర్తిగా తమకు నచ్చింది కాదు... తమకు చెంది, తాము జీవించలేకపోతున్న జీవితం ఇంకేదో ఎక్కడో ఉంది. ఆ వెలితిని పూరించేందుకు...ఆత్మలోని ఏదో ఆ ఖాళీని, వెలితిని పూరించేందుకు...'

రాయలు ఆమెను గమనించనట్టే ముందుకు నడిచాడు.

అతనికి 'మనిషి' యొక్క మూలాలు అర్థమౌతున్నాయి...

పురాస్మృతులేవో అతన్ని చుట్టుముడ్తున్నాయి..ముసురువలె.

●

**'ఆంధ్రజ్యోతి'** ఆదివారం అనుబంధం
తేది : 20-09-2009